క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

పుట్టపర్తి: బుక్కపట్నం మండలానికి చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన స్విమ్మింగ్ అండర్-19 విభాగం పోటీల్లో గోవర్ధన్, మంజునాథ్, అండర్ -17 విభాగంలో ధనుంజయ ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 5 నుంచి 7 వరకు నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. అలాగే అండర్-14 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వెంకటసాయి ఎంపికయ్యాడు. ఇతడు అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పీడీ నాగరాజు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం జగదీష్, జిల్లా ఏపీపీఆర్ అధ్యక్షుడు వరప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

8న మండల సర్వసభ్య సమావేశం

తనకల్లు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డెప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండల అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

క్లోరినేషన్ పరిశీలన



క్లోరోస్కోప్ పరీక్షలు చేస్తున్న సీహెచ్ఓ రామచంద్రారెడ్డి

నల్లచెరువు: చెవిటివారిపల్లిలో శ్రీసత్యసాయి వాటర్ ప్లాంట్‌లో వైద్యాధికారులు సోమవారం నిర్వహించిన క్లోరినేషన్ కార్యక్రమాన్ని సీహెచ్ఓ రామచంద్రారెడ్డి పరిశీలించారు. ప్లాంట్ నుంచి వచ్చే నీటిలో క్లోరిన్ శాతం, నీటిలో ఏవైనా బ్యాక్టీరియాలు ఉన్నాయా అని క్లోరోస్కోప్ ద్వారా పరీక్షలు చేశారు. 1.00 పీపీఎం శాతం ఫ్లోరిన్ ఉన్న మంచినీరుగా గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సజావుగా పరీక్షలు

పుట్టపర్తి: కొత్తచెరువు బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈఐఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం పరీక్షకు 34 మంది విద్యార్థులకు గాను 33 మంది హాజరయ్యారు. ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు.

ఇళ్లపట్టాలు మంజూరు చేయండి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని 83-1, 2 సర్వే నంబర్‌లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఇళ్ల పట్టాల కోసం గతంలో కలెక్టర్, ఆర్డీఓలకు కూడా విన్నవించామన్నారు. అనంతరం రెవిన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధునాయక్, నాగభూషణం, గంగాద్రి, శ్రీనివాసులు, కవిత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ మహేష్ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్‌పై డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ చట్ట పరిధిలోనే స్కానింగ్ సెంటర్లు నిర్వహించాలన్నారు. లింగనిర్ధారణ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయరాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ బాబాఫక్రుద్దీన్, గైనకాలజిస్టు మాధవి, చిన్నపిల్లల వైద్యుడు వెంకటేశ్వర్లు, డీబీసీ ఆఫీసర్ అనురాధ, వైద్యాధికారి సురేష్‌నాయక్, టూటౌన్ సీఐ రెడ్డప్ప, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సత్యనిర్ధారణ్, రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, హెల్త్ ఎడ్యుకేటర్ సుశీలమ్మ, కోఆర్డినేటర్ అన్నా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి ఉత్తిదే

- చెత్త ఉంది కానీ.. సంపదే లేదు
- పల్లెల్లో తీవ్రమవుతున్న చెత్త సమస్యలు
- పత్తాలేని గ్రీన్ అంబాసిడర్లు.. ఎక్కడి చెత్త అక్కడే
- వినియోగంలో లేని చెత్త సంపద కేంద్రాలు



నల్లచెరువులోని చెత్తతో సంపద తయారీ కేంద్రం



పెద్దయల్లంపల్లి వద్ద పిచ్చిమొక్కలతో నిండిన చెత్త సంపద కేంద్రం



కె.పూలకుంటలో రోడ్డు పక్కన ఆపేసిన చెత్త తరలించే వాహనం

నల్లచెరువు: చెత్తతో సంపద తయారీ కేంద్రాలు దిష్టి బొమ్మల్లా మారాయి. చెత్త ఉన్నప్పటికీ సంపద లేదు. పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా గతంలో మండలంలోని 13 గ్రామపంచాయతీల పరిధిలో చెత్తతో సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రారంభంలో చెత్త సేకరణ జరిగింది. తర్వాత నిర్వహణ లేక కేంద్రాలు పిచ్చిమొక్కలతో నిండి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేయాలి. గ్రీన్ అంబాసిడర్‌ల ద్వారా చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలి. పొడి చెత్తగా పిలిచే ప్లాస్టిక్ వస్తువులను విక్రయించడం ద్వారా లాభం ఆర్జించాలి. తడి చెత్తను ఉపయోగించి సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలి. తద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పడుతుందనేది చెత్త సంపద కేంద్రాల ముఖ్య ఉద్దేశం.

పారిశుధ్యం అస్తవ్యస్తం

చెత్తను సేకరించేందుకు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను నియమిస్తామని చెప్పారు. ఇళ్లలో తడి, పొడి చెత్తలను వేరు చేసేందుకు గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఇంటింటికీ రెండు ప్లాస్టిక్ బక్కెట్లను పంపిణీ చేశారు. చెత్తను తరలించేందుకు రిక్షాలను కూడా పంపిణీ చేశారు. ప్రస్తుతం అవి మూలన పడ్డాయి. కొన్ని గ్రామాల్లో అయితే రిక్షాలను కంప చెట్లలో పడేశారు. మందుబాబులు రిక్షాలను గుజిరీకి అమ్మేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటి సంగతి పక్కన పెడితే గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిపోయింది. గ్రీన్ అంబాసిడర్ల జాడే లేదు. అన్ని చెత్త కేంద్రాలూ నిరూపయోగంగానే ఉన్నాయి. అధికారులు వీటిని పునరుద్ధరించడంతో పాటు పంచాయతీల ఆదాయం పెంపొందించవలసిన అవసరం ఉంది.

చెత్త కుండీలైనా ఏర్పాటు చేయాలి

రెండేళ్ల క్రితం గ్రామంలో ప్రతి ఇంటికీ రెండు ప్లాస్టిక్ బకెట్లు ఇచ్చి తడి, పొడి చెత్తలను వేరువేరుగా ఇవ్వాలని అధికారులు చెప్పారు. గత కొంత కాలంగా రోడ్డు మీద ఉన్న చెత్తను కూడా సక్రమంగా తీయడం లేదు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే చెత్త కుళ్లి దుర్వాసన వస్తోంది. అధికారులు కనీసం చెత్త కుండీలను అయినా ఏర్పాటు చేయాలని నల్లచెరువు గ్రామస్తులు కోరుతున్నారు.

పంచాయతీల్లో నిధుల కొరత



గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇచ్చేందుకు ప్రస్తుతం నిధుల కొరత ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వారికి జీతాలు ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ఆ నిధులు సాధారణ ఖర్చులకే సరిపోవడం లేదు. దీంతో గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేయలేకపోయాం. త్వరలోనే చెత్త సంపద కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం.

– పంచరత్నమ్మ, సర్పంచ్, నల్లచెరువు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



అరవిందరెడ్డిని పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: బసిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అరవిందరెడ్డి ఇటీవల గుండె సంబంధిత వ్యాధికి గురై శస్త్రచికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం బసిరెడ్డిపల్లికి వెళ్లి అరవిందరెడ్డిని పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సూర్యనారాయణ, వంకరకుంట సర్పంచ్ కుళ్లాయప్ప, నాయకులు ఓబిరెడ్డి, చిన్నాగప్ప, ఈశ్వర్‌రెడ్డి, కేశప్ప, మాధవరెడ్డి, రాజేంద్రనాయక్, రాజమోహన్‌రెడ్డి, హరినాథరెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త అక్రమ అరెస్ట్

- బాధితుడికి అండగా నిలిచిన పార్టీ నాయకులు



బెయిల్‌పై బయటకు వచ్చిన మలక అమర్‌నాథరెడ్డి

కదిరి టౌన్: నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త మలక అమర్‌నాథ్‌రెడ్డిని ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడనే కారణంతో ఆదివారం ఆయన్ను బెంగుళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో పోలీసులు అరెస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న కదిరి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి వెంటనే పోలీసు అధికారులతో మాట్లాడారు. సోమవారం వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మలక అమర్‌నాథ్‌రెడ్డిని బెయిల్‌పై బయటకు తీసుకొచ్చారు. అనంతరం అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ, భావప్రకటన స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. సోషల్ మీడియా పోస్టులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా తుంగలోతొక్కుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారెవరైనా తప్పక న్యాయస్థానం ముందు నిలవాల్సి ఉంటుందన్నారు.

పెట్టుబడి సాయం విడుదల చేయాలి



తనకల్లులో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

కనగానపల్లి: వర్షాభావ పరిస్థితులతో వంటలు పండక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ రైతు సంఘం నాయకులు సోమవారం మండలంలోని పలు గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందు, మండల కార్యదర్శి నాగరాజు, సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, స్థానిక రైతు సంఘం నాయకులు మల్లికార్జున, అంకె నాగేష్, రాము, ఆదిరెడ్డి, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

తనకల్లు: కరువు మండలంగా తనకల్లును ప్రకటించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు మండలంగా ప్రకటించి, రైతుల అన్ని రకాల రుణాలూ రద్దు చేయాలని కోరారు. చెరువులను నింపి అయకట్టుకు సాగునీరందించాలని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప, నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నల్లమాడ: నల్లమాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం నాయకులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, అంజినప్ప పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి

బత్తలపల్లి: అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.20వేల పెట్టుబడి సాయం రైతులకు త్వరగా అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బత్తలపల్లి, పోట్లమర్రి, తంబాపురం, మాల్యవంతం, ఈదుల ముష్టూరు, సంజీవపురం గ్రామ సచివాలయాల్లోని కార్యదర్శులకు పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ వినతిపత్రాలను ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో అందజేశారు.

రైతుల నుంచి వేరుశనగ కొనుగోలు



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

నల్లమాడ: యర్రవంకపల్లిలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఇండి గ్యాప్ సర్టిఫికెట్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగకాయల కొనుగోలు కోసం నల్లమాడ, అమడగూరు, ఓడీ చెరువు మండలాలకు చెందిన 15 మంది రైతులను ప్రాథమికంగా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. తొలిరోజు యర్రవంకపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే రైతు నుంచి 17 క్వింటాళ్లు వేరుశనగ కాయలు కొనుగోలు చేశారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి పండించిన పంటకు తేమ శాతం, గింజ నాణ్యతను బట్టి గిట్టుబాటు ధర కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని కదిరి వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, జిల్లా వనరుల కేంద్రం పుట్టపర్తికి చెందిన సనావుల్లా తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సుమతి, ఇంటర్నల్ ఆడిటర్ వెంకటేష్, వ్యవసాయ సహాకురాలు కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

మహాసమాధిని దర్శించుకున్న మంత్రి సత్యప్రసాద్

ప్రశాంతి నిలయం: సత్యసాయి మహాసమాధిని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ దర్శించుకున్నారు. సోమవారం జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు పుట్టపర్తికి విచ్చేసిన ఆయనకు ప్రశాంతి నిలయంలో శాంతిభవన్ అతిథి గృహం వద్ద కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ మంత్రిని కలిసిన ఎస్పీ

పుట్టపర్తి టౌన్: జిల్లా పర్యటనకు విచ్చేసిన ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సోమవారం సాయి ఆరామంలో ఎస్పీ రత్న మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా శాంతి భద్రతలపై కాసేపు చర్చించారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

ధర్మవరం అర్బన్: విజయవాడలోని వరద ప్రభావిత రామలింగేశ్వర్ నగర్ కట్ట ప్రాంతంలో 1100 కుటుంబాలకు ధర్మవరం 'స్పందన ఆసుపత్రి' వైద్యులు టీఎం బషీర్, వై.సోనియా సహకారంతో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ చేతుల మీదుగా అందజేశారు. మానవ సేవే మాధవ సేవ అన్న స్ఫూర్తితో తాము ఈ కార్యక్రమం చేపట్టామని వైద్యులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రూ.50 వేలు పలికిన వారపు సంత

కనగానపల్లి: మామిళ్లపల్లిలో నిర్వహించే వారపు సంత రూ.50 వేలు పలికింది. సోమవారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ ఓబిరెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి అరుణ్‌పాండే వేలం పాట నిర్వహించారు. బోయ నాగేంద్ర రూ.50 వేలకు వేలం దక్కించుకున్నాడు.

పశువులకు ఉచిత గర్భకోశ చికిత్సలు

ముదిగుబ్బ: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం సిద్దన్నగారిపల్లిలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. 36 పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ టీవీ సుధాకర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు చూపాలని వినతి

చెన్నేకొత్తపల్లి: తమకు 30 ఏళ్ల క్రితం కేటాయించిన ఇళ్ల స్థలాలు ఎక్కడ ఉన్నాయో చూపాలని మండల పరిధిలోని న్యామద్దెల గ్రామానికి చెందిన ఆదెమ్మ, సరస్వతమ్మ, రామాంజినమ్మ, లక్ష్మమ్మ, రాయమ్మ, తిరుమలక్క తదితరులు సోమవారం తహసీల్దార్ సురేష్ కుమార్‌ను కోరారు. విచారణ చేసి, న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలి

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి మంచి పేరు తేవాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు సీతారాం, కార్యదర్శి రమేష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర ఆకాంక్షించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్-14 విభాగంలో మనోజ్, అశోక్ ఈ నెల 6, 7 తేదీల్లో అన్నమయ్య జిల్లా అంగల్లులో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్-17 విభాగంలో సాయిప్రసాద్ ఈ నెల 9, 10 తేదీల్లో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్-19 విభాగంలో చిరంజీవి, నిఖిల్ ఈ నెల 9, 10 తేదీల్లో ఏలూరు జిల్లా పెద్దవేగిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

కదిరిఅర్బన్: కదిరికుంట్లపల్లి సమీపంలో సోమవారం పేకాట స్థావరంపై రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,03,000 నగదుతో పాటు ఏడు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఏడుగురు పేకాటరాయుళ్లు పరారీ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బత్తలపల్లి: వేల్పుమడుగులోని బీసీ కాలనీలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. వారి నుంచి రూ.3,650 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బీసీలకు రక్షణ చట్టం కావాలి

కదిరిటౌన్: ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని బీసీల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు పుట్టపర్తిలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి విన్నవించారు. ప్రతి జిల్లాలోనూ స్థలం కేటాయించి బీసీల భవనం నిర్మించాలని, బీసీ హాస్టళ్లను అభివృద్ధి చేయాలని, బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని కోరారు. అనంతరం మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు నామాల శంకర, రజక సంఘం నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడికి అవమానం

పుట్టపర్తి టౌన్: సర్పంచుల సమస్యలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విన్నవించేందుకు వెళ్లిన సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల వెంగమనాయుడు (భూషణం)కు అవమానం జరిగింది. ఆయన్ను మంత్రిని కలవనీయకుండా పోలీసులు అడ్డుకుని వెనక్కు పంపారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో సోమవారం టీడీపీ జిల్లా జిల్లా అధ్యక్షుడు అంజనప్ప అధ్యక్షతన జిల్లాస్థాయి కూటమి పార్టీల నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీరితో పాటు రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, సవిత, ఎంపీ పార్థసారధి, ఎమ్మెల్యేలు సింధూరరెడ్డి, ఎమ్ఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. మూడుగంటలపాటు సాగిన సమావేశంలో నాయకుల మధ్య విభేదాలు, నామినేటెడ్ పదవులు, ఇతర సమస్యలపై ఇన్‌చార్జ్ మంత్రికి వివరించారు. ఇన్‌చార్జ్ మంత్రి పర్యటన నేపథ్యంలో ఎస్పీ రత్న ఆదేశాల మేరకు డీఎస్పీ విజయకుమార్ నేతృత్వంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే ఇన్‌చార్జ్ మంత్రిని కలిసే అవకాశం కల్పించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించేందుకు సర్పంచులతో కలిసి వచ్చిన జిల్లా అధ్యక్షుడు వెంగమనాయుడును అడ్డుకున్నారు. దీంతో కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు మడకశిర ఎమ్మెల్యే బయటకు వచ్చి సర్ది చెప్పి అక్కడి నుంచి పంపేశారు. దీంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు.

సమాచారం ప్రజల హక్కు

అమడగూరు: అధికార యంత్రాంగం పరిధిలో ఉన్న సమాచారాన్ని ప్రజలకు తెలియజేయడానికే సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు ఏడీఏ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఓడిచెరువు, అమడగూరు మండలాల రైతుసేవ కేంద్రాల సిబ్బందికి ఓడిచెరువు వ్యవసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సత్యనారాయణతో పాటు మరో ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం విధివిధానాలను తెలియజేశారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడానికి ఈ చట్టం రూపొందించినట్లు పేర్కొన్నారు. అనంతరం మామిళ్లకుంట్లపల్లి వద్ద కంది పంట దిగుబడిపై సలహాలను తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటరమణాచారి, ఏఈఓ వెంకటేష్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక మాసం.. ఆకాశ దీపం



కదిరిలో అలంకరణలో శివపార్వతులు



తలుపులలో నందీశ్వరుని వద్ద కార్తీక దీపోత్సవం

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుని ఆలయంలో కార్తీక మాస తొలి సోమవారం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ప్రధాన అర్చకులు కేశవస్వామి ఆధ్వర్యంలో ఆకాశ దీపం ఎగుర వేశారు. తొలుత దీపం వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు కూడా స్వయంగా కార్తీక దీప పూజలు చేశారు. ఆకాశ దీపాన్ని ఎగుర వేసిన అనంతరం ప్రధాన అర్చకులు మాట్లాడుతూ కార్తీక మాసోత్సవాలు జరుగుతున్నాయని తెలిపేందుకు ఈ మాసమంతా ఆకాశ దీపాన్ని వెలిగించడం సంప్రదాయమన్నారు. అన్ని శివాలయాలు, అమ్మవారి ఆలయాలలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ మాసంలో దీపాలు వెలిగించడం పుణ్యదాయకమని అన్నారు. అలాగే మండలంలోని సంగమేశ్వరక్షేత్రం, కాటి కోటేశ్వరక్షేత్రంలతో పాటు పోట్లమర్రి, ముష్టూరులోని శివాలయాలు, డి.చెర్లోపల్లిలోని సిద్దేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం దేవాలయాలు శివనామస్మరణలతో మార్మోగాయి. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయాల నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కార్తీక మాస ప్రత్యేక పూజలు

తాడిమర్రి: కార్తీక మాస తొలి సోమవారం కావడంతో మండలంలోని చిల్లవారిపల్లి సమీపంలో కాటికోటేశ్వర క్షేత్రం, పురాతన శివాలయం, భైరవేశ్వరస్వామి ఆలయం, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాల శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక దీపాలు వెలిగించారు.

ముదిగుబ్బలో కార్తీక మాస పూజలు

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలో సోమవారం కార్తీక సోమవారం పురస్కరించుకుని అర్ధనారీశ్వర అలంకారంలో భవాని శంకరస్వామి దర్శనమిచ్చారు. పంచామృతాల తోటి పంచ సూక్తులతో రుద్రాభిషేకాన్ని పూజారి రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్తీక మాస మహోత్సవంలో భాగంగా పలువురు భక్తులు అయ్యప్ప, శివదీక్ష మాల ధరించారు. మహిళలు కార్తీక దీపారాధన చేశారు.

కార్తీక దీపోత్సవ కార్యక్రమం



బత్తలపల్లిలో ఆకాశదీపం ఎగురవేస్తున్న దృశ్యం

తలుపుల : మండల కేంద్రం ఎగువపేట సమీపంలోని ఏటిగంగమ్మ వద్దనున్న నందీశ్వరుని ఆలయంలో మహిళలు కార్తీక దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కదిరి టౌన్: కార్తీక మాస మొదటి సోమవారం పట్టణంలోని శివాలయం, సైదాపురం శివాలయం, మరకత మహాలక్ష్మి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శివాలయంలో మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో పూజలు

చెన్నేకొత్తపల్లి: వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో ఉదయాన్నే స్వామి మూల విరాట్‌కు అభిషేకం చేశారు.

విద్యార్థులందరూ 'అపార్' చేయించుకోవాలి

తాడిమర్రి: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ తప్పనిసరిగా అపార్ (ఆటోమేటెడ్ అకడమిక్ అకౌంట్ రిజిస్టర్) నమోదు చేయించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఎం.కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఇదివరకే విద్యార్థుల నుంచి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులం, బ్యాంక్ ఖాతా పుస్తకాల జిరాక్స్ తీసుకున్నారన్నారు. మండలంలో 2,538 మంది విద్యార్థులు ఉండగా.. ఇప్పటి వరకు 1,492 మంది విద్యార్థుల వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. 59 శాతం నమోదుతో తాడిమర్రి మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు.